VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఆళ్ళగడ్డ
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్ళగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 14-11-2023 సంపుటి : 06 సంచిక : 69 పేజీలు : 8 వెల : రూ 3-00

## కాంగ్రెస్ పతనానికి కౌంట్‌డౌన్ షురూ : మోదీ



రాయ్‌పూర్ : చత్తీస్‌ఘఢ్‌లో కాంగ్రెస్ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తొలి దశ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అంతం ఖాయమైందని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 17న మలి దశ పోలింగ్‌కు ముందు సోమవారం ముంగేలిలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. కాంగ్రెస్ దౌర్భాగ్య పాలనకు చత్తీస్‌ఘఢ్ ప్రజలు చరమగీతం పాడనున్నారని చెప్పారు. ఐదేండ్ల పాటు మిమ్మల్ని దోచుకున్న కాంగ్రెస్ పాలకులను సాగనంపే సమయం ఆసన్నమైందని అన్నారు.కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఇక ఎంతమాత్రం కోరుకోవడం లేదన్నారు. చత్తీస్‌ఘఢ్ సీఎం భూపేష్ బఘేల్ రాష్ట్రంలో అవినీతి పాలనతో కోట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అవినీతి నేతలపై చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. చత్తీస్‌ఘఢ్ సీఎం తన నియోజక వర్గంలో ఓడిపోతారని మీడియా మిత్రులు తనకు చెప్పారని వివరించారు. మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్‌లో కాంగ్రెస్ నేతలకు సంబంధం ఉందని ప్రధాని మోదీ ఆరోపించారు.మహదేవ్ యాప్ స్కామ్‌లో రూ. 508 కోట్ల అవినీతి జరిగిందని, ఈ కేసులో పెద్దమొత్తంలో నగదును దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకున్నాయని చెప్పారు. చత్తీస్‌ఘఢ్ సీఎంకు అత్యంత సన్నిహితుడు ఈ కేసులో జైలులో ఉన్నారని గుర్తుచేశారు. ఈ స్కామ్‌లో సీఎంకు ఎంత డబ్బు ముట్టింది, పార్టీ నేతలు ఎంత తీసుకున్నారు, ఢిల్లీకి ఎంత డబ్బు చేరిందనే వివరాలను కాంగ్రెస్ వెల్లడించాలని ప్రధాని మోదీ డిమాండ్ చేశారు.

## విషాదం నింపిన వేర్వేరు ప్రమాదాలు

**పలు ప్రమాదాల్లో 8మంది మృతి**
**కోనసీమ జిల్లా రోడ్డు ప్రమాదంలోముగ్గురు దుర్మరణం**
**కడప జిల్లాలో బైక్,లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి**
**మున్నేరు వాగులో మునిగి ముగ్గురు మృత్యువాత**

విజయవాడ,నవంబర్13: ఆంధ్రప్రదేశ్‌లో ఒకే రోజు వేర్వేరు ఘటనల్లో 8 మంది యువకులు మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు, కడప జిల్లా పందిళ్లపల్లి వద్ద బైక్ ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు, ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం వద్ద మున్నేరు వాగులో మునిగి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా యానాం జాతీయ రహదారిపై బైక్ పై వెళ్తున్న ముగ్గురు యువకులు ట్రాక్టర్ ను ఢీకొట్టి ప్రాణాలు కోల్పోయారు. బైక్ తో వేగంగా వస్తూ ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ను ఢీకొనగా ముగ్గురు స్పాట్ లోనే చనిపోయారు. మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులు తాళ్లరేవు మండలం రచ్చవారిపేటకు చెందిన ఓలేటి శ్రీను (28), ఓలేటి రాజు(26), ఎదుర్లంక గ్రామం రామాలయంపేటకు చెందిన పాలేపు ప్రసాద్ (24)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో రచ్చావారిపేటకు చెందిన రచ్చ శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురూ కలిసి పెయింటింగ్ పనులు చేసుకుంటుండగా, ఒకే బైక్ పై వెళ్తూ ట్రాక్టరును ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అటు, వైఎస్ఆర్ జిల్లా కమలాపురం పందిళ్లపల్లి వద్ద బైక్ ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు స్పాట్ లోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రకాశం జిల్లా పొన్నలూరుకు చెందిన బింగి మహేశ్ (31), బింగి చిన్నమోహన్(29) నల్లలింగాయపల్లెలో తాపీమేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున పెట్రోల్ బంకు నుంచి ద్విచక్రవాహనంపై పెట్రోల్ తీసుకుని వెళ్తుండగా పందిళ్లపల్లి వద్ద కడప - తాడిపత్రి జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలోని కీసర వద్ద మున్నేరు వాగులో ఈతకు దిగి ఐదుగురు యువకులు గల్లంతయ్యారు. సరదాగా ఈత కొట్టేందుకు వచ్చిన వీరు లోతు తెలియక నీటిలో మునిగిపోయారు. సమీపంలోని స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు పరుగున వచ్చి వారిని బయటకు తీశారు. అప్పటికే ముగ్గురు యువకులు మృతి చెందగా, మిగిలిన ఇద్దరిని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతులు ఐతవరం గ్రామానికి చెందిన చేజర్ల దినేశ్, యడవల్లి గణెళిష్, గాలి సంతోష్ కుమార్ గా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇసుకు కుంభకోణంలో వెంకటరామిరెడ్డి వాటా ఎంత ? : నక్కా ఆనంద్ బాబు



అమరావతి,నవంబర్13 : రాష్ట్రంలో జరుగుతున్న ఇసుకు కుంభకోణంలో ఏపీ సీఎం జగన్ వాటా రూ.50వేల కోట్లయితే.. వెంకటరామిరెడ్డి వాటా ఎంత ? అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్ బాబు పేర్కొన్నారు. దొంగ వే బిల్స్‌తో రాష్ట్ర సంపదను కొల్లగొడుతు న్నారంటూ నక్కా ఆనంద్ బాబు ఆధారాలు బయటపెట్టారు. కలకత్తా నుంచి రహస్యంగా నడిపిన ఇసుక టెండర్ల విధానం మరో పెద్ద కుంభకోణమని నక్కా ఆనంద్ బాబు పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల పొట్ట గొట్టి మరీ వేల కోట్లు ఇసుక ద్వారా దోచుకున్నారన్నారు. ఇసుక కుంభకోణం డబ్బుతోనే వచ్చే ఎన్నికలకు వెళ్లాలని జగన్ చూస్తున్నాడని పేర్కొన్నారు. ఏపీఎండీసీ వీసీ, డైరెక్టర్ గా ఉన్న వెంకటరామిరెడ్డే ప్రతి ఇసుక అక్రమ తవ్వకంలోనూ ప్రధాన వాటాదారు అని నక్కా ఆనంద్ బాబు తెలిపారు. డిప్యుటేషన్ మీద రాష్ట్రానికి వచ్చిన వెంకటరామిరెడ్డి, తెలుగుదేశం ఇచ్చిన ఉచిత ఇసుక విధానంలో అవినీతి అని ఫిర్యాదు చేశాడన్నారు. ఇసుక అక్రమాల్లో తనకు భవిష్యత్తులో శిక్ష తప్పదనే ముందుగా ఓ ఫిర్యాదు పడేశాడన్నారు. గుండె ఆపరేషన్ వంకతో ఇంటినే కార్యాలయంలా మార్చుకున్న వెంకటరామిరెడ్డి రాష్ట్ర సంపదను కొల్లగొడుతున్నారని పేర్కొన్నారు. ఇసుక అక్రమాలు, బిల్లుల చెల్లింపులపై మా ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేక తప్పించుకు తిరుగుతున్నాడని నక్కా ఆనంద్ బాబు తెలిపారు.

## అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్

అమరావతి,నవంబర్13 :నాంపల్లి అగ్ని ప్రమాదం ఘటనపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. అగ్నిప్రమాద ఘటన దిగ్భ్రాంతి కరమని.. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలో చోటు చేసుకున్న ఘోర అగ్నిప్రమాదంలో తొమ్మిది మంది మృత్యువాతపడ్డారని తెలిసి తీవ్రగ్భ్రాంతికి లోనైట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ కుటుం బాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాయాల పాలైనవారికి, అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. భవనాల్లో ద్వారా తెలిసిందన్నారు. నివాస ప్రాంతాల్లో ప్రమాదాలకు ఆస్కారం ఇచ్చేవాటిని నిల్వ చేయకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు.



### నాంపల్లిలోని బజారఘాట్ ఏరియాలో
## ఘోర అగ్నిప్రమాదం



**ఈ ప్రమాదంలో 9 మంది దుర్మరణం**
**మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు**
**చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు**

హైదరాబాద్, నవంబర్13 : నాంపల్లిలోని బజారఘాట్ ఏరియాలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఓ అపార్టుమెంటు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు ఐదు అంతస్తులకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో తొమ్మిది దుర్మరణం పాలయ్యారు. వారిలో కొందరు ఊపిరాడక ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు సజీవ దహనమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక నాలుగు రోజుల పసికందు ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అపార్టుమెంటు ముందు పార్క్ చేసి ఉన్న ఒక కారు, ఆరు ద్విచక్రవాహనాలు కూడా ఈ ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ప్రమాదం జరగగానే స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఫైర్ సిబ్బంది నాలుగు ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పేశారు. అపార్టుమెంటులో చిక్కుకున్న 21 మందిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. అపార్టుమెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓ గ్యారేజీ ఉన్నదని, ఆ గ్యారేజీలో కారును రిపేర్ చేస్తుండగా మంటలు చెలరేగాయని మధ్యమండల డీసీపీ వేంకటేశ్వర్‌రావు తెలిపారు. గ్యారేజీ సమీపంలో డీజిల్, కెమికల్ డ్రమ్ములకు మంటలు అంటుకుని అపార్టు మెంటు పైఅంతస్థులకు వ్యాపించాయని చెప్పారు. అపార్టుమెంటు మూడు, నాలుగో ఫ్లోర్‌లలో అద్దెకు ఉండే కుటుంబాలు మంటల్లో చిక్కుకున్నా యన్నారు. కాగా, అపార్టుమెంటు ఓనర్ రమేష్ జైశ్వాల్‌కు కెమికల్ కంపెనీలు ఉన్నాయి. ఈ క్రమంలో అపార్టుమెంటు సెల్లార్‌లో అతను 130 డ్రమ్ముల కెమిక ల్‌ను నిలువచేశారు. పాస్టిక్ తయారీకి వినియోగించే ఈ కెమికల్ డ్రమ్ముల్లో 30 డ్రమ్ములకు మంటలు అంటుకుని పెద్ద ఎత్తున చెలరేగాయి. ఆలోపే ఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పుతూనే కాలిపోకుండా ఉన్న మిగతా డ్రమ్ములను బయటకు తీసుకొచ్చారు.కాగా, ప్రమాదం అనంతరం ఆపార్టుమెంటు ఓనర్ రమేశ్ జైశ్వాల్ పరారయ్యాడు. పరారీలో ఉన్న అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## వైసీపీ సైకోని చెప్పులతో ప్రజలు తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే : నారా లోకేశ్

అమరావతి,నవంబర్13 (ఆర్ఎ న్ఎ): కొలిమిగుండ్లలో తెలుగు యువత అధికార ప్రతినిధి మంద విజయ్‌గోపాల్‌పై వైసీపీ నేతల దాడిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తీవ్రంగా ఖండించారు. దాడిపై ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "తెలుగు యువత అధికార ప్రతినిధి మంద విజయ్‌గోపాల్‌పై వైసీపీ సైకోల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. మా విజయ్ గోపాల్‌ను చెప్పులతో కొట్టిన ప్రతి ఒక్క వైసీపీ సైకోని అవే చెప్పులతో ప్రజలు తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. పాలక పార్టీ ఫ్యాక్షనిస్టుల కంటే ఘోరంగా దాడులు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? బాధితులపై రివర్స్ కేసులు



## నందం సుబ్బయ్య హత్య కేసు

**ప్రొద్దుటూరు టిడిపి నేత ప్రవీణ్‌కుమార్ అరెస్ట్**
**మీడియాతో మాట్లాడుతుండగా పోలీసుల రాక**

కడప,నవంబర్13(ఆర్ఎన్ఎ):వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. నందం సుబ్బయ్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ కార్యకర్త బెనర్జీపై గత నెల 28వ తేదీన తెలుగుదేశం కార్యకర్తలు భరత్, రాము కత్తితో దాడి చేశారు. ఈ దాడికి కుట్ర చేసింది ప్రవీణ్ కుమార్ రెడ్డినేనని పోలీసులుకేసు నమోదుచేశారు. దీంతో అరెస్టు చేస్తారన్న ఉద్దేశంతో గత 17 రోజులుగా ప్రవీణ్ రెడ్డి అజ్ఞాతంలో ఉన్నారు. సోమవారం తెలుగుదేశం నేతలతో కలిసి ఆయన ఇంట్లో ప్రెస్ మీట్ నిర్వహిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. దాడితో సంబంధం లేకపోయినా.. అక్రమంగా కేసు నమోదు చేశారంటూ ప్రవీణ్ సహా తెలుగుదేశం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ.. జీపు ఎక్కకుండానే.. త్రీ టౌన్ స్టేషన్‌కు నడుచుకుంటూ ర్యాలీగా వెళ్లారు. ప్రవీణ్‌తో పాటు కుటుంబ సభ్యులు, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి, కార్యకర్తలు కూడా పాదయాత్రగా ఆయన వెంటే వెళ్లారు. ప్రవీణ్ అరెస్టు ఘటన పట్టణంలో సంచలనంగా మారింది. వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి కుట్రతోనే తనను అక్రమ కేసులో ఇరికించారని ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ నేత బెనర్జీపై దాడి కేసులో కుట్రదారుడిగా పేర్కొంటూ ప్రవీణ్ కుమార్ రెడ్డిని అరెస్ట్ చేస్తున్నట్లు డీఎస్పీ ప్రకటించారు. దాడి గఠన సమయంలో తాను అక్కడ లేకపోయినప్పటికీ తనపై కేసు నమోదు చేయడం పట్ల ప్రవీణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ పోలీస్ స్టేషన్ వరకు నడుచుకుంటూ వెళ్లారు. పోలీసులు జీపు ఎక్కాలని ఎంత ఒత్తిడి చేసినా ఎక్కకుండా నడుచుకుంటూ వెళ్లారు. అనంతరం అక్కడ నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గత నెల 28న ప్రొద్దుటూరులో వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర జరిగింది. ఈ బస్సుయాత్రలో టీడీపీ నేత నందం సుబ్బయ్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ కార్యకర్త బెనర్జీ సైతం పాల్గొన్నారు. గాంధీ రోడ్డులోని మెడినోవా సర్కిల్ వద్ద వైసీపీ నేత బెనర్జీపై తెలుగు యువత నాయకుడు భరత్ కుమార్ రెడ్డి కత్తితో దాడి చేశాడు. బెనర్జీకి, భరత్ కుమార్ రెడ్డికి వ్యక్తిగత విబేధాలు ఉన్నాయి.

## అధికారంలోకి వస్తే ఉచితంగా అయోధ్య దర్శనం: అమిత్ షా

భోపాల్: మధ్యప్రదేశ్‌లో తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలను అయోధ్య దర్శనానికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఎలాంటి ఖర్చు లేకుండా దశలవారీగా అందర్నీ అయోధ్యకు తీసుకెళ్తాం అని చెప్పారు.ఎన్నికల మేనిఫెస్టోలనూ ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు చెప్పారు. సోమవారం విదిశలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు.మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. నవంబర్ 15కు ప్రచారాలు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారంలో వేగం పెంచాయి. ప్రచారంలో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. నేను బీజేపీ అధ్యక్షునిగా ఇప్పుడు చెబుతున్నా జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట జరుగుతుంది" అని అమిత్ షా అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు తమ కుమారుల భవిష్యత్ కోసమే ప్రాకులాడుతున్నారని అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్ నాథ్, రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ తమ కుమారులను సీఎం చేయాలని చూస్తున్నారని తెలిపిన అమిత్ షా.. కేవలం సంతానం కోసమే రాజకీయాల్లో ఉన్నవారు ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తారని మండిపడ్డారు.



# సంపాదకీయం

మంగళవారం 14-11-2023

## జీఎస్టీ వాతలు ఎన్నికల ఎజెండా కావాలి !

కోట్లాదిమంది హిందువులు పరమ పవిత్రంగా భావించే గంగాజలంపై కేంద్రప్రభుత్వం 18 శాతం జీఎస్టీ విధించాలనుకోవడం దారుణం కాక మరోటి కాదు. ఇది భారతీయులకే కాదు..కోట్లాదిగా ఉన్న ప్రపంచంలోని హిందువులకు కూడా అవమానకరమైన నిర్ణయంగా చూడాలి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ దోపిడీకి, కపటత్వానికి ఇది పరాకాష్ఠ. గంగ మనకు పరమపవిత్ర నది. గంగాజలం అంతకన్నా పరమపవిత్రం. జీవితం లో ఒక్కసారయినా గంగా స్నానం చేయాలని, గంగతీర్థం పుచ్చుకోవాలని హిందువులు భావిస్తారు. సాధారణ హిందువుకు పుట్టుక నుంచి మరణం వరకూ తల్లి గంగానది ప్రాధాన్యం సాటిలేనిది. అలాంటి గంగాజలంపైనే 18 శాతంజీఎస్టీ విధించాలనుకోవడం దుర్మార్గం. గంగాజలాన్ని ఆర్డర్ చేసి తెప్పించుకోవాలనుకునే వారికి ఇది భారమే. దీన్ని పట్టించుకుని నిలదీయాల్సిన తరుణం ఆసన్నమైంది. అయితే గంగాజలంపై జీఎస్టీ విధించటం లేదని పరోక్ష పన్నులు, కస్టమ్స్ సెంట్రల్ బోర్డు (సీబీఐసీ) 'ఎక్స్'లో వెల్లడించింది. అయితే నిప్పులేనిదే పొగరాదు. ఇప్పటికే పలు రకాల వస్తువులపై జిఎస్టీ విధించి ప్రజల నడ్డి విరుస్తోంది మోడీ ప్రభుత్వం. ఆరోగ్య బీమా, సాధారణజీవిత బీమా పథకాలపైనా జిఎస్సీ విధించడం సామాన్యులకు మోయలేని భారంగా మారింది. జిఎస్టీ తదితర పన్నులపై సమీక్షించాలి. అలాగే జిఎస్టీ వాయింపు అన్నది ఎన్నికల ఎజెండా కావాలి. ప్రజలంతా తమను నమ్ముతున్నారన్న భ్రమలో మోడీ జిఎస్టీ ద్వారా వేస్తున్న భారం ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. ఇప్పుడు జరుగబోతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో జిఎస్టీపై బిజెపిని ఆయా రాష్ట్రాల ప్రజలు నిలదీయాలి. మొత్తంగానే వివిధ రకాల జిఎస్టీ వాయింపులపై విపక్షాలు కూడా తమ వైఖరిని స్పష్టం చేయాలి. ఐదురాష్ట్రాల ఎన్నికల పక్రియ డిసెంబర్ మొదటి వారంలోనే ముగియనున్నది. ఐదు రాష్ట్రాల్లో నూ నవంబర్ నెలాఖరు లోపే పోలింగ్‌ను ముగించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. బహుశా, డిసెంబర్‌లో ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశా లకు ఒక కీలకమైన ఎజెండాను మోదీ సర్కార్ నిర్ణయించుకుని ఉండవచ్చు. అంతకుముందే ప్రభుత్వ ఎజెండా ఏమిటన్నది ప్రజలు నిర్ణయించాలి. ఎక్కడికక్కడ జిఎస్టీపై ఇకనుంచి చర్చ జరగాలి. జిఎస్టీతో జరుగుతున్న వాతలపైనా చర్చించాలి. వివిధ రంగాల ద్వారా ప్రజలపై ఎలా భారం పడుతుందో చర్చించాలి. విపక్షాలు కావచ్చు..ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు కూడా దీనిపై ప్రజల్లో చర్చ చేయాలి. ఐదు రాష్ట్రాల్లోనూ అక్టోబర్ 9 నుంచి రెండు నెలల పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఫలితాలు ఎలావున్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టి ఇప్పటికే వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలపైనే ఉన్నదని చెప్పక తప్పదు. ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం, నిర్వహణను ఆయన ఇప్పటికే 'మోదీ కేంద్రీకృత ఎన్నికలు'గా మార్చారు. అందువల్ల ఆయా రాష్ట్రాల్లో జిఎస్టీ వల్ల కలుగుతున్న అనర్థాలను చర్చించాలి. ఎక్కడిక్కడ బిజెపి నేతలను నిలదీస్తూ వారి అభిప్రాయాలను కూడగట్టాలి. ఇలా ఎన్నికల్లో ప్రజల బాధలను ప్రభుత్వానికి ఎజెండాగా చేయాలి. ప్రస్తుత ప్రచార సరళిని సార్వత్రిక ఎన్నికల వరకూ కొనసాగించాలి. జిఎస్టీ బాదుడు విషయంలో మోదీని ఢీకొనడంపై దృష్టి మరింతగా సారించాల్సి ఉంది. ఐదు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలకు ఒక వేళ విజయాలు లభించినా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జిఎస్టీపై వాటి వైఖరి ఏంటన్నది నిలదీయాలి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఈ అయిదు రాష్ట్రాల్లో ఓడిపోయింది. ఉత్తర భారతంలో హిందీ ప్రాంతాలైన మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం హస్తగతం చేసుకుంది. తెలంగాణలో కేసీఆర్ రెండవసారి అధికారానికి వచ్చారు. మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్‌నే యథాప్రకారం విజయం వరించింది. 2018లో మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్‌లలో అంతకు ముందు 15 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీని ఓడించినందుకు, రాజస్థాన్‌లో అధికారంలోకి వచ్చినందుకు కాంగ్రెస్ తనకు తిరుగులేదని భావించింది. కానీ మధ్యప్రదేశ్‌లో అధికారన్ని కాంగ్రెస్ నుంచి బిజెపి హస్తగతం చేసుకుంది. ఈ క్రమంలో మోడీ ఘన విజయాలపైన కాకుండా మోడీ వైఫల్యాలను ప్రజలు ఎజెండాగా చేసుకోవాలి. అప్పుడే మోడీ కళ్లు తెరిచి ప్రజలవైపు చూస్తారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై తప్పకుండా పడుతుంది. పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీకి, ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలను కత్తిమీద సాములా ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావాలి. ప్రజలు తము కట్టిన పన్నులతో అధికారంలో ఉన్న వారు సరదాలు తీర్చుకునే దుస్థితి పోవాలి. ఈ సారి 'ఇండియా' కూటమి సంఘటితం కావడంపై కాకుండా మోడీ జిఎస్టీ వాయింపులపై ప్రజలతో కలసి పోరాడాలి. కేవలం వివిధ రంగాలపై జిఎస్టీ ఎంతటి దుష్ప్రభావం చూపుతుందో చర్చించాలి. అప్పుడే వారి కూటమిన ప్రజలు నమ్ముతారు. బీజేపీకి ఎప్పటిలా మోదీ ఆకర్షణ, జాతీయ వాదం, హిందూత్వ, డబుల్ ఇంజన్ సర్కార్‌తో పాటు ప్రతిపక్షాల అవినీతి, కుటుంబపాలనపై విరుచుకుపడడం ప్రధాన అస్త్రాలుగా ఉన్నాయి. తాజాగా మహిళా రిజర్వేషన్‌ను ఉపయోగించుకోవడానికి కూడా ప్రయత్నిస్తోంది. కనుక ఇవి సమస్యలు కాదని, అసలు సమస్య ప్రజలపై భారం మోపుతున్న జిఎస్టీ అని నిరూపించాలి. ప్రజలు చైతన్యం కాకుంటే పాలకులు ఎప్పుడూ స్వారీ చేస్తూనే ఉంటారు. అలా జరక్కుండా ప్రజలు ఆలోచన చేయాలి. వారి తాయిలాలకు లొంగకుండా సమస్యలను ఎజెండాగా చేసుకుని ముందుకు సాగగలిగితే భారత ప్రజాస్వామ్యం మనగులుగుతుంది.

## వివిధ పార్టీల నుండి బిజేపీ లోకి చేరిక.

-కాషాయ కండువా కప్పి ఆహ్వానించిన ధర్మన్న.
-కుంజా ధర్మన్న సుపరిచితుడు, ధర్మన్నతోనే మా ప్రయాణం.





దుమ్ముగూడెం నవంబర్ 13 విజయ తెలంగాణ : మండల పరిధిలోని బొజ్జికుప్ప, పాత నారాయణరావు పేట గ్రామాల్లోని వివిధ పార్టీలకు చెందిన100 కుటుంబాలు శనివారం బిజేపీ అభ్యర్థి కుంజా ధర్మారావు ఆధ్వర్యంలో కాషాయ కండువా కప్పుకొని బిజేపీ పార్టీలో చేరారు. కాషాయ కండువా కప్పుకున్న వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కుంజా ధర్మన్న మాకు సుపరిచితుడు, గతంలో మా కోసం అనేక ఉద్యమాలు చేసిన నాయకుడు ధర్మన్న అని కొనియాడారు. ఆయనతోనే మా ప్రయాణం అంటూ కమలం గుర్తుకే మా ఓటు, ధర్మన్న కే మా ఓటు అంటూ నినాదాలు చేశారు. ధర్మన్న గెలుపు కోసం కృషి చేస్తానని వారు తెలిపారు. బొజ్జికుప్ప గ్రామం నుండి వివిధ పార్టీలకు చెందిన గ్రామస్థులు కొమరం పాపారావు, వర్సా రామ్మూర్తి, కొర్సా నారాయణ, కొర్సా రాజేష్, కుర్సం శేఖర్, కుర్సం కళ్యాణ్, కుర్సం వెంకటేష్, కుర్సం వీరస్వామి, కుర్సం రామకృష్ణ, కారం చిట్టిబాబు, కొమరం వీర భద్రం, కొమరం ప్రసాద్, కొమరం లక్ష్మణ్, కొమరం చందు, కొర్సా ముద్ది రాజు, కొర్సా మల్లారిస్వామి, సోయం కాంతారావు, సోయం నారాయణ, పాయం శ్రీరాములు, పాయం రాము, పాత నారాయణరావు పేట గ్రామం నుండి మాజీ ఉప సర్పంచ్ ఉకే వీరభద్రం, కొమరం ప్రసాద్, కొమరం జోగరావు, సవలం లక్ష్మీ, ఉకే నాగమణి, కొమరం వెంకటేశ్వర్లు, బాబూరావు, కూరం మల్లేష్, ఉకే చలపతి, సవలం జోగరావు, కూరం రాజశేఖర్, పెనుబల్లి సూరిబాబు, కొమరం భద్రయ్యలు కుంజా ధర్మా రావు కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుంజా సంతోష్ కుమార్, విస్తార్ జి నరసింహరావు, సమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో ప్రముఖులంతా ఇక్కడే పోటీ

అధికార బిఆర్ఎస్ నుంచి ముగ్గురు మంత్రులు
బిజెపి నుంచి ఇద్దరు ఎంపిలు..ఒక ఎమ్మెల్యే

కరీంనగర్,నవంబర్13 : రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. దానికి కారణం ప్రధాన పార్టీల ముఖ్య నాయకులు ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి శాసనసభ ఎన్నికల బరిలో నిలిచారు. పార్టీల్లో ముఖ్యమైన పదవుల్లో ఉన్నవారు,మంత్రులు ఇక్కడి నుంచే పోటీ పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు, ఇద్దరు ఎంపిలు, ఒక మాజీ ఎంపి ప్రస్తుతం పోటీలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల ఎంపికలో, పార్టీ నిర్ణయాల్లో వీరి పాత్ర ఉంది. ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీల తరఫున వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల అభ్యర్థి, మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో పార్టీ తరఫున అన్ని తానై వ్యవహరి స్తున్నారు. జిల్లాల్లో సభలు నిర్వహించి తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు పరిచిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తున్నారు. ప్రజా ఆశీర్వాద సభల పేరిట అనేక నియోజకవర్గాల్లో పాల్గొని ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థుల నామపత్రాల దాఖలు కార్యక్రమాల్లో ఏర్పాటు చేస్తున్న రోడ్‌షోల్లో కూడా పాల్గొన్నారు. భాజపాకు సంబంధించి రాష్ట్రంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థి ఈటల రాజేందర్ ఆ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ ఛైర్మన్‌గా, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. వీరిద్దరు ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో, పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు. ఈటల రాజేందర్ హుజూరాబాద్ బరిలో నిలవడంతోపాటు గజ్వేల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పోటీ చేస్తున్నారు. పార్టీ క్యాంపెయినర్‌గా పలు జిల్లాల నియోజకవర్గాల్లో పార్టీ పక్షాన ప్రచార సభల్లో పాల్గొంటున్నారు. ఎంపీ బండి సంజయ్ రాష్ట్ర భాజపా అధ్యక్షుడిగా పని చేసినప్పుడు ఆ పార్టీకి ఊపు తీసుకొచ్చారనే పేరుంది. ప్రస్తుతం పార్టీ క్యాంపెయినర్‌గా, కరీంనగర్ అభ్యర్థిగా నియోజకవర్గాల్లో పాదయాత్రలు చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాల్లో పార్టీ ప్రచార సభల్లో పాల్గొని అభ్యర్థుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వీరిద్దరికి పార్టీ అధిష్ఠానం హెలికాప్టర్ కేటాయించింది. ఇకపోతే మంత్రులు గంగుల కమలాకర్ కరీంనగర్ నుంచి, కొప్పుల ఈశ్వర్ ధర్మపురి నుంచిహుస్నాబాద్ నుంచి మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ పోటీలో ఉన్నారు. బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ కూడా కోరుట్ల బరిలో నిలిచారు. దీంతో ఉమ్మడి జిల్లా ప్రముఖుల జాబితాలో చేరింది. ఇకపోతే కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మున్నూరు కాపు, ముస్లిం ఓటర్లే కీలకం కానున్నారు. దీంతో మూడు ప్రధాన పార్టీలు కూడా వారి ఓట్లపైనే ఫోకస్ పెట్టాయి. ఈ క్రమంలో మున్నూరు కాపు నేతలనే తమ అభ్యర్థులుగా ప్రకటించాయి. ఒకప్పుడు వెలమల ఇలాఖాగా పేరొందిన కరీంనగర్‌లో మున్నూరు కాపుల రాజకీయ ప్రాబల్యం పెరగడంతో ప్రధాన పార్టీలు కూడా వారికే ప్రాధాన్యమిచ్చాయి. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ ఇప్పటికీ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, నాలుగోసారి పోటీలో ఉండగా, అదే సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్ గతంలో బీజేపీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయి, మూడోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ తరఫున మున్నూరు కాపు నేత, బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్ మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ పార్టీల నుంచి బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎక్కువ మంది మున్నూరు కాపులే కావడం విశేషం. మంథని నుంచి పుట్ట మధు, రామగుండం నుంచి కోరుకంటి చందర్, కరీంనగర్ నుంచి గంగుల కమలాకర్‌కు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చింది. ఇక, కాంగ్రెస్ పార్టీ వేములవాడలో ఆది శ్రీనివాస్, కరీంనగర్‌లో పురమల్ల శ్రీనివాస్‌కు టికెట్లు కేటాయించింది. బీజేపీ కూడా ఇదే సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌కు కరీంనగర్‌లో, కోరుట్లలో ధర్మపురి అర్వింద్‌కు, హుస్నాబాద్‌లో బొమ్మా శ్రీరామ్ చక్రవర్తికి టికెట్ ఇచ్చింది.

## కాంగ్రెస్ శ్రేణులు అందరూ కలిసి కష్టపడి పని చేయాలి : పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం,నవంబర్13 (ఆర్ఎన్ఎ): ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఖమ్మం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 30 న జరగబోయే ఎన్నికల్లో ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నుంచి తాను, కొత్తగూడెం నుంచి కూనంనేని సాంబశివరావు పోటీలో ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు అందరూ కలిసి కష్టపడి పని చేస్తేనే విజయం మనది అవుతుందన్నారు. కనిపించని శక్తి కాంగ్రెస్ కార్యకర్తలని.. ఆ శక్తితోనే అనుకున్న ఫలితాలు మనవి అవుతాయన్నారు. ఖమ్మంలో తుమ్మల నాగేశ్వరరావు గెలుపు నల్లేరుపై నడకేనని పొంగులేటి తెలిపారు. ఈ ఎన్నికల్లో 78 సీట్లు కాంగ్రెస్‌వేనన్నారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయనున్నారని పొంగులేటి జోస్యం చెప్పారు. తుమ్మల నాగేశ్వరరావును కార్యకర్తలు కష్టపడి గెలుపించుకోవాలన్నారు. ఖమ్మంలో డబ్బును నమ్ముకొని గెలుస్తానాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కలలు కంటున్నారన్నారు. డబ్బు గెలుస్తుందా? కార్యకర్తలను నమ్ముకున్న తుమ్మల నాగేశ్వరరావు గెలుస్తారా ..? అనేది తేలాల్సి ఉందన్నారు. డబ్బు మదంతో కేసీఆర్ విర్రవీగుతున్నారని.. ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి తెలిపారు.



## ఖమ్మంమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నామినేషన్ తిరస్కరించండి

ఎన్నికల కమిషన్కు ఖమ్మంకాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరావు ఫిర్యాదు



ఖమ్మం బ్యూరోఖమ్మం టిఆర్ఎస్ అభ్యర్థి రవాణా శాఖమంత్రి పువ్వాడ అజయ్ నామినేషన్ తిరస్కరించాలని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఎలక్షన్ కమిషన్కు ఫిర్యాదు చేశారు ఎన్నికల సంఘం నిబంధనలు ప్రకారం ఎనిమిది కాలాలలో ఉండాల్సిన ఫార్మేట్ లేదని కేవలం 6 కాలలోనే ఉందని తుమ్మల పువ్వాడ నామినేషన్ జిరాక్స్ విలేకరులకు చూపించారు ఇదే విషయాన్ని ఖమ్మం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారికి ఇచ్చానని ఖమ్మం జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్ నామినేషన్ సరిగానే ఉందని అన్నారని ఇదే విషయాన్ని రిటర్నింగ్ అధికారి వికాస్ రాజు కు ఫిర్యాదు చేశానని తప్పకుండా నామినేషన్ తిరస్కరించాలని కోరానని అన్నారు ఒకవేళ ఎలక్షన్ కమిషన్ దీనిపై యాక్షన్ తీసుకోపోతే కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తానని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరావు అన్నారు

## ఈరోజు ఖమ్మం రఘునాథపాలెం మండలంలో స్వతంత్ర అభ్యర్థి గుర్రం సత్యనారాయణ ప్రచారం



ఈరోజు ఖమ్మం రఘునాథపాలెం మండలంలో ఖమ్మం స్వతంత్ర అభ్యర్థి జి పి అర్ టెస్ట్ చైర్మన్ బృంద హాస్పిటల్ అధినేతగుర్రం సత్యనారాయణ ప్రచారం ముమ్మరం చేశారు గ్రామాల్లో తిరుగుతూ తమకు అవకాశం కల్పించాలని కోరారు తమకు అవకాశం కల్పిస్తే విద్య వైద్య ఫ్రీగా అందేలా ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తమ సేవలు మరింత ఎక్కువగా చేస్తానని కనుక ప్రజలు ఆలోచించి ఈసారి తమకి ఖమ్మంలో గెలిచేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు ఆయన ప్రచారంలో ప్రజలు స్పందన అద్భుతంగా ఉంది ఆయన ప్రచారం చేస్తుండగా ప్రజలు బారులు తీసి ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు తప్పకుండా తమకే ఓటు వేస్తానంటూ నినాదాలు చేశారు

## బీఆర్ఎస్ నేతలు మన ఇళ్లల్లోకి వస్తే తిరగబడండి.. తరిమి కొట్టండి : సీతక్క


హైదరాబాద్,నవంబర్13 ములుగు కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నన్ను ఓడించేందుకు రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ములుగులో పోటీ చేస్తోంది నాగజ్యోతి కాదు.. కేసీఆర్, కేటీఆర్. దొంగ నోట్లు కూడా పంచుతున్నారని, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. 'సీతక్క మంత్రి అవుతుందంట' అంటూ హేళన చేస్తున్నారని, బడుగు బలహీనవర్గాలు మంత్రులు కావద్దా?, ఇంకా దొరల చేతిలో బందీలుగా బతుకుదామా?, దొరల తెలంగాణ కావాలా..? ప్రజల వద్దకే పాలన అందించే కాంగ్రెస్ పార్టీ కావాలో ప్రజలే తేల్చుకోవాలి. మనకు ఇల్లు, పోడు భూములకు పట్టాలు, మన పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వని బీఆర్ఎస్ నేతలు మన ఇళ్లల్లోకి వస్తే తిరగబడండి.. తరిమి కొట్టండి." అని సీతక్క పిలుపునిచ్చారు.

## బీఆర్ఎస్‌లో వైఎస్సార్‌టీపీ విలీనం.. స్వాగతించిన మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ : వైఎస్సార్‌టీపీ పార్టీ నుంచి పలువురు నేతలు, అన్ని జిల్లా కోఆర్డినేటర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గట్టు రాంచందర్ రావు అధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వైఎస్సార్‌టీపీ పార్టీని బీఆర్ఎస్ పార్టీలో విలీనం చేయడానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు స్వాగతం తెలిపారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఎన్నికల్లో వైఎస్సార్టీపీ పోటీ చేయట్లేదని.. కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా మద్దతిస్తున్నట్లు ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రకటించిన సంగతి తెలిసిందే. నమ్మివస్తే తమను నట్టేట ముంచిన షర్మిలపై రాజీనామా చేసిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ పార్టీని బీఆర్ఎస్‌లో విలీనం చేయడానికి సిద్ధమయ్యారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని తాము భావించి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు స్పష్టం చేశారు.



# ఇరకాటంలో టీడీపీ..



నెల్లూరు, నవంబర్ 13, తెలంగాణ పొలిటికల్ స్క్రీన్ భగభగమంటోంది. ఆ తాలూకా సెగ ఏపీలో టీడీపీకి భరించలేనంత మంట పుట్టిస్తోందట. అసలు పోటీలో లేకున్నా? ఈ సెగేంటి? ఈ గోలేంటి? ఇదెక్కడి సమస్య అని సణుక్కుంటున్నారట ఆ పార్టీ నాయకులు. ఏపీలో టీడీపీ-జనసేన కలిసి నడుస్తున్నాయి. బీజేపీని కూడా కలుపుకుని వెళ్లాలనే ప్రతిపాదనలు బలంగా వస్తున్నా.. అది తమకు నష్టమే తప్ప వీసమెత్తు లాభం లేదనేది మెజార్టీ టీడీపీ నేతల భావన. దాదాపు పార్టీ అధినాయకత్వం కూడా అదే ఆలోచనతో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామ క్రమంలోనే.. మధ్యే మార్గంగా తెలంగాణ ఎలక్షన్ రేసు నుంచి తప్పుకుని చేతులు దులిపేసుకుంది టీడీపీ. ఆ ఫలితాలు ఎలా ఉన్నా.. విజయం ఎవరిని వరించినా.. పక్క రాష్ట్రం ప్రభావం తమ మీద ఏ మాత్రం పడదని లెక్కలేసుకుంటూ ఊపిరి తీసుకుంది.అయితే.. అదే సమయంలో మిత్రపక్షం జనసేన తెలంగాణలో చేస్తున్న రాజకీయం ఇప్పుడు ఏపీలో తమ మెడకు చుట్టుకుంటుందేమోనన్న డౌటనుమానాలు పెరుగుతున్నాయట టీడీపీ నేతలకు.ఏపీలో మిత్రపక్షం

## జనసేన, బీజేపీ ప్రేమ

జనసేనకు తెలంగాణలో బీజేపీతో పొత్తులో ఉంది. అందులో భాగంగానే ఎనిమిది స్థానాల్లో పోటీ చేస్తోంది ఆ పార్టీ. ఇటు ప్రధాని పాల్గొన్న సభలో ఆయనతో పాటు పవన్ కళ్యాణ్ వేదిక పంచుకున్నారు కూడా. పవన్ తమతో ఉన్నారని మోడీ సైతం చెప్పారు. ఈ రాజకీయమంతా.. తెలంగాణ వరకు బాగానే ఉంటుంది. కానీ ఏపీకి వచ్చేసరికి పరిస్థితేంటనే చర్చ ఇప్పుడు టీడీపీ వర్గాల్లో జరుగుతోంది. ఏపీలో బీజేపీని కలుపుకోకుండా ఎన్నికలకు వెళ్తేనే బెటరని చాలా మంది టీడీపీ నేతలు భావిస్తున్నారు. ఈ సమయంలో బీజేపీ-జనసేన లవ్ స్టోరీకి ఎలాంటి సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోందట. అక్కడ అలా. ఇక్కడ ఇలా అంటూ రాజకీయ ప్రత్యర్థులు జనసేనను టార్గెట్ చేసుకునే క్రమంలో తాము కూడా సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని కంగారు పడుతున్నారట సైకిల్ పార్టీ నేతలు. ఇప్పటికే వైసీపీ వర్గాలు ఇదే అంశంపై అటు జనసేనను.. ఇటు టీడీపీని విమర్శిస్తూనే ఉన్నాయి.బీజేపీతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని టీడీపీ, జనసేన రాజకీయం చేస్తున్నాయనే విమర్శలకు తెలంగాణలో జనసేన రాజకీయం ఆస్కారం ఇచ్చినట్టు అవుతోందనేది టీడీపీ వర్గాల భావన. అలాగని.. బీజేపీతో కూటమి కట్టి ఏపీలో ఎన్నికలకు వెళ్తే అది మరింత ఇబ్బందులను సృష్టించే వ్యవహారం అవుతుందన్న భయం పెరుగుతోంది. చంద్రబాబు జైలుకెళ్లడానికి జగన్ ఎంత కారణమో.. బీజేపీ కూడా అంతే కారణమనే భావన టీడీపీ కేడరులో బలంగా నాటుకు పోయింది. ఈ పరిస్థితుల్లో బీజేపీతో వెళ్లేందుకు ఏ ఒక్కరు కూడా ఇష్టపడని పరిస్థితి. పోనీ కేడర్ విషయం పక్కన పెట్టినా.. ప్రజల్లో బీజేపీకి ఏమైనా సానుకూలత ఉందా..? అంటే అదీ లేదు. దీంతో కాషాయ పార్టీతో కలిస్తే.. నష్టం బోల్డంత.. లాభం కూసింత అన్నట్టుగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీంతో కౌంటర్ ఏమివ్వాలా..? అని ఎంత ఆలోచించుకున్నా? బుర్రకు ఏం ఐడియా తట్టడం లేదట. దీంతో కాలమే సమాధానం చెబుతుందంటూ నిర్వేదంతో ఉన్నారట కొందరు టీడీపీ నేతలు. మరి తెలంగాణలో జనసేన-బీజేపీ లవ్ స్టోరీ ఏపీలో ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

# టీడీపీ కేడర్ కు కేసుల భయం

రాజమండ్రి, నవంబర్ 13, ఎన్నికలకు ప్రణాళికలు, ప్రచారం, మేనిఫెస్టో రూపకల్పన, అభ్యర్థులను ఖరారు చేయడం ఒక ఎత్తు. ఎలక్షనీరింగ్ చేయడం మరో ఎత్తు. పోలింగ్ డేట్‌కు ముందు ఉండే రెండు రోజులు చాలా కీలకం. బూత్‌లలో.. కౌంటింగ్ సెంటర్లల్లో పార్టీ కేడర్ చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఆ రెండు రోజులు ఓటర్లను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది. పోలింగ్ బూత్‌లలో దొంగ ఓటర్లను కనిపెట్టేందుకు ఏజెంట్లు ఉండాలి. ఇదంతా జరగాలంటే? కార్యకర్తలతో ఒక వ్యవస్థను సిద్ధం చేయాల్సి ఉంటుంది. అందుకోసం ఎలక్షనీరింగ్‌లో అనుభవం ఉన్న కేడర్ అవసరం ఎంతో ఉంటుంది. ప్రజల్లో తమ పార్టీపై సానుభూతి ఉన్నా.. ప్రత్యర్థి పార్టీ మీద వ్యతిరేకత ఉన్నా.. ఎలక్షనీరింగ్ సరిగా చేసుకోలేకపోతే నానా తంటాలు పడాల్సి వస్తుంది. అలాంటి కేడర్ మీద ఇప్పుడు వరుస కేసులు బుక్ అవడం టీడీపీని కలవరపెడుతోందట. పార్టీ ముఖ్య నేతల మీదే కాకుండా.. క్షేత్ర స్థాయిలో టీడీపీ కేడర్ మీద కూడా విపరీతంగా కేసులు నమోదయ్యాయన్నది పార్టీ రాష్ట్ర నాయకత్వానికి వచ్చిన ఫీడ్ బ్యాక్ అట.నాలుగున్నరేళ్ల కాలంలో వివిధ సందర్భాల్లో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల పేరుతోనో, లేక మరో రకంగానో మొత్తం 175 నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయి కేడర్‌పై భారీ సంఖ్యలో కేసులు ఉన్నాయట. చిన్న చిన్న అంశాల మీద కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తూ నానా ఇబ్బందులు పెడుతున్నారని టీడీపీ చాలా కాలం నుంచి విమర్శలు చేస్తూనే ఉంది. ఎన్నికలు దగ్గర పడుతున్న క్రమంలో మొత్తంగా ఎన్ని కేసులు ఉన్నాయనే సమాచారాన్ని టీడీపీ అధిష్టానం సేకరించిందట. ఆ ఫిగర్ చూసి పార్టీ పెద్దలకు కళ్ళు బైర్లు కమ్మినట్టు తెలిసింది. ఇప్పటి వరకు ఉన్న లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కేడర్ మీద దాదాపు 60 వేల కేసులు ఉ

## నాలుగున్నర ఏళ్లలో 60 వేల కేసులు

న్నట్టు తేలిందట. వీళ్లల్లో చాలా మంది క్షేత్ర స్థాయిలో పార్టీకి సంబంధించి ఎన్నికల విధులు నిర్వహించేవారే ఉన్నారు. ఎలక్షనీరింగ్‌లో చురుగ్గా ఉండేవారి పైనే ఎక్కువగా కేసులు పెట్టారంటోంది టీడీపీ. ఎన్నికల్లో పైస్థాయి నేతలనే కాకుండా.. క్షేత్ర స్థాయిలో కేడర్‌ను కూడా టార్గెట్ చేసుకుంటూ ప్రభుత్వం ఓ వ్యూహం ప్రకారం కీలకమైన వారి మీద ఏదో ఒక కేసు పెడుతోందన్నది టీడీపీ అభియోగం. ఆ కేసుల పేరుతో పోలింగ్‌కు ముందు వాళ్ళందర్నీ కట్టడి చేస్తే? తమ పని తేలిక అవుతుందన్నది వైసీపీ వ్యూహంగా అనుమానిస్తున్నారు టీడీపీ ముఖ్యులు. ఈ పరిస్థితుల్లో ఈ కేసుల నుంచి కేడర్‌కు ఎలా విముక్తి కలిగించాలనే అంశంపై కిందా మీదా పడుతోందట సైకిల్ పార్టీ నాయకత్వం. ఎన్నికల నాటికి ఈ కేసుల నుంచి కేడర్‌కు విముక్తి కలిగించకుంటే.. ఇబ్బంది వస్తుందన్న ఆందోళన పెరుగుతోందట.అసలు 60 వేల కేసుల మీద న్యాయపోరాటం చేయడం ఎలాగంటూ? లీగల్ ఎక్స్‌పర్ట్స్‌ను సంప్రదిస్తోందట. ఇదే అంశంపై టీడీపీ-జనసేన జేఏసీ సమావేశంలో కీలక చర్చ జరిగింది. టీడీపీతో పాటు కొన్ని చోట్ల జనసేన కేడర్ మీద కూడా ఇదే తరహాలో కేసులు పెట్టారనే అంశం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై ప్రత్యేక ఫోకస్ పెట్టి.. న్యాయ పోరాటం చేయాలనే అభిప్రాయానికి వచ్చాయట రెండు పార్టీలు. అయితే అన్ని కేసుల మీద న్యాయపోరాటం అంత తేలికైన విషయం కాదంటున్నారు. దీంతో ఎలక్షన్ టైంకి వ్యవహారం కొలిక్కి రాని పక్షంలో ఎలక్షనీరింగ్‌కు ఇబ్బంది లేకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనే దాని పైనా ఇప్పటి నుంచే కసరత్తు చేసుకుంటే బెటరన్న సూచనలు వస్తున్నాయట పార్టీ అధినాయకత్వానికి.

# దారిమళ్లుతున్న పోలవరం మట్టి

ఏలూరు, నవంబర్ 13, ఏపీలో అధికార పార్టీ నేతల అక్రమాలు, అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. అక్రమ రిజిస్ట్రేషన్ల స్కాం ను స్వయంగా వైసీపీ నేతే బయటపెట్టగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పదిమందిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లే కాదు.. అక్రమ మైనింగ్, అక్రమ ఇసుక రవాణా, అక్రమంగా మట్టి తవ్వకాలు, అనుమతులు లేకుండానే కొండలను పిండిచేసి తవ్వేయడం ఇలా ఎన్నో అక్రమాలు వైసీపీ సర్కార్ అండతో వైసీపీ నేతలు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రాత్రికి రాత్రి పోలవరం కుడికాలువను తవ్వుకొని మట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న వైనాన్ని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం సీనియర్ నేత చింతమనేని ప్రభాకర్ తన అనుచరులతో కలిసి బట్టబయలు చేశారు. దెందులూరు నియోజకవర్గంలో పలు చోట్ల రాత్రయితే చాలు వైసీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో చీకటి వ్యాపారం మొదలవుతుందన్న ఆరోపణలున్నాయి. ప్రతి రోజూ రాత్రి 10 గంటల తర్వాత మొదలయ్యే ఈ అక్రమ మైనింగ్ వ్యవహారం ఉదయం 6 గంటల వరకూ సాగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.ఈ చీకటి వ్యాపారంలో భాగంగానే గత కొంత కాలంగా పెదవేగి మండలంలో పలు చోట్ల రాత్రిపూట పోలవరం కుడికాలను తవ్వుకొని యథేచ్ఛగా మట్టిని అమ్ముకుంటున్నారని చెబుతున్నారు. రాత్రి కూడా మట్టి మాఫియా లారీలు, జేసీబీలతో పోలవరం కుడి కాలువను తవ్వేస్తుంటే.. స్థానిక టీడీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే చింతమనేనికి సమాచారం ఇచ్చారు. తన అనుచరులు, గ్రామస్థులతో పోలవరం కాలువ వద్దకు చేరుకున్న చింతమనేని తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో మా వాహనాలే ఆపుతారా అంటూ వైసీపీ నాయకులు రెచ్చిపోయి దుర్భాషలాడారు. మట్టి మాఫియాపై అర్ధరాతి అధికారులకు పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదు. దీంతో గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు సహా చింతమనేని తెల్లవారే వరకూ అక్కడే వేచి ఉన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మొత్తం తొమ్మిది టిప్పర్లు, రెండు జేసీబీలు, రెండు ట్రాక్టర్లు సీజ్ చేసి పెదవేగి పోలీస్ స్టేషన్ కి తరలించారు.పెదవేగి మండలంలో ఈ అక్రమ తవ్వకాలు ఈనాటివేమీ కాదు. గత ఏడాది జనవరిలోనే పోలవరం కుడి కాలువ అక్రమ తవ్వకాలను చింతమనేని వెలుగులోకి తెచ్చారు. పగటి సమయంలో మీడియాను తీసుకెళ్లి మట్టి తవ్విన ప్రాంతాలను చూపించారు. అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు, పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.


కానీ అప్పటి నుండి అధికారుల నుండి ఎలాంటి చర్యలూ లేవు. ఈ ఏడాదిన్నరగా తెగ రెచ్చిపోయిన వైసీపీ మట్టి బకాసురులు యథేచ్ఛగా రాత్రికు ళ కాలువను తవ్వేస్తున్నారు. స్థానికులు, గ్రామస్థులు ఇదే విషయంపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలోనే వైసీపీ నేతలు ఈ మైనింగ్ మాఫియాకు తెగబడుతున్నాయనీ, ఆ కారణంగానే అధికారులు, పోలీసులు ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని స్థానికులు అంటున్నారు. అయితే ఇప్పుడు తవ్వకాలు జరుగుతుండగానే చింతమనేని ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి తెలుగుదేశం పట్టుకోవడంతో ఇక తప్పక అధికారులు వాహనాలను సీజ్ చేశారని అంటున్నారు. కాగా అక్రమ తవ్వకాలను అడ్డుకున్న చింతమనేని, గ్రామస్థులపై వైసీపీ నేతలు తీవ్ర దుర్భాషలకు దిగారు. ఇదంతా మీడియా కవర్ చేస్తున్నా.. వీడియో రికార్డ్ అవుతున్నా లెక్క చేయని వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. పెదవేగి మండలంలో అక్రమ తవ్వకాలు, వైసీపీ నేతల దౌర్జన్యాలు అంటూ చింతమనేని సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేయగా.. అది వైరల్ అయ్యింది. ఏపీలో జగన్ మోహన్ రెడ్డి పాలనలో వైసీపీ నేతలు ఎంతగా అక్రమాలకు పాల్పడుతున్నారో ఈ వీడియో మరోసారి కళ్లకు కట్టిందని నెటిజన్లు పేర్కొంటున్నారు. అలాగే యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూ ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు కూడా వెనకాడకుండా బరితెగించడంపై ప్రజలు విస్తుపోతున్నారు. ఇలాంటి జగన్ పాలన ఇంకానా వద్దు వద్దు అంటున్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ అంటూ వైసీపీ చేపట్టిన కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ.. ఏపీ డోంట్ నీడ్ జగన్ అంటూ రిటార్డ్ ఇస్తున్నారు.



# అద్భుతంగా రెడీ అవుతున్న స్మృతి వనం

విజయవాడ, నవంబర్ 13,ఈమధ్య కాలంలో అంబేద్కర్ విగ్రహాల ట్రెండ్ కొనసాగుతోంది. గతంలో తెలంగాణ సచివాలయానిక కూత వేదు దూరంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించారు. అయితే హైదరాబాద్ తరహాలో 125 అడుగుల అతి పెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమైంది. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం రోజున ఈ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా జాతికి అంకితం చేసే విధంగా పనులు నిర్వహిస్తున్నారు.ఈమధ్య కాలంలో అంబేద్కర్ విగ్రహాల ట్రెండ్ కొనసాగుతోంది. గతంలో తెలంగాణ సచివాలయానిక కూత వేదు దూరంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించారు. దీనిని అంబేద్కర్ జయంతి రోజున కేసీఆర్ తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అయితే హైదరాబాద్ తరహాలో అతి పెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమైంది. బెజవాడ స్వరాజ్ మైదానంలో నిర్మిస్తున్న అంబేద్కర్ స్మృతి వనం పనులు తుది దశకు చేరుకున్నాయి. విజయవాడ నగరానికే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం నిలవనుంది. ఎత్తైన పిల్లర్లతో అద్భుతమైన భవంతిని నిర్మిస్తున్నారు.నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం రోజున డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా జాతికి అంకితం చేసే విధంగా పనులు నిర్వహిస్తున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేస్తున్నారు. పచ్చని చెట్లతో పర్యటకులకు అహ్లాదాన్ని పంచేందుకు అతిపెద్ద పార్క్ నిర్మిస్తున్నారు.విగ్రహం బేస్ కింది భాగంలో గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లు ఉంటాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు హాళ్లు ఉంటాయి. ఒక్కో హాలు 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో ఓ సినిమా హాలు, మిగిలిన మూడు హాళ్లలో ఆయన చరిత్ర తెలిపే డిజిటల్ మ్యూజియం ఉంటుంది. వీటితో పాటూ వాటర్ ఫౌంటేన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. రాత్రి పూట రంగు రంగుల కాంతులతో ఆకర్షణీయంగా కనిపించనుంది.

# వైసీపీ, జనసేన, టీడీపీ క్రాకర్స్



ఒంగోలు, నవంబర్ 13, వచ్చే ఏడాది ఏపిలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది దీపావళి క్రాకర్స్‌ను అమ్ముకునేందుకు వ్యాపారులు కొత్త కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణాలో నామినేషన్లు వేసి ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు తలమునకలై ఉన్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు తమ ప్రయత్నాలు తాము చేస్తున్నారు. అందులో భాగంగా దీపావళి పండుగలో ప్రముఖ పాత్ర పోషించే బాణాసంచాను అమ్ముకునేందుకు వ్యాపారులు లేటెస్ట్ ట్రెండ్‌ను అనుసరిస్తున్నారు.వచ్చే ఏడాది ఏపిలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది దీపావళి క్రాకర్స్‌ను అమ్ముకునేందుకు వ్యాపారులు కొత్త కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణాలో నామినేషన్లు వేసి ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు తలమునకలై ఉన్నారు.ఓటర్లను ఆకట్టుకునేందుకు తమ ప్రయత్నాలు తాము చేస్తున్నారు. అందులో భాగంగా దీపావళి పండుగలో ప్రముఖ పాత్ర పోషించే బాణాసంచాను అమ్ముకునేందుకు వ్యాపారులు లేటెస్ట్ ట్రెండ్‌ను అనుసరిస్తున్నారు.ముఖ్యంగా ఏపిలో లీడర్స్ ఫోటోతో క్రాకర్స్ మార్కెట్లోకి వచ్చేశాయి. వచ్చే ఏడాది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది దీపావళి పండుగ వేళ క్రాకర్స్‌ను క్యాష్ చేసుకునేందకు రాజకీయ నేతల ఫోటోలు, పేర్లతో అట్టలపై ముద్రించి సొమ్ము చేసుకుంటున్నారు.ఈ తరహాలోనే ప్రకాశంజిల్లా జరుగుమల్లి మండలంలోని ఓ చిన్న గ్రామం కామేపల్లిలో సైతం క్రాకర్స్ దుకాణంలో వివిధ పార్టీ నాయకుల చిత్రాలతో కనువిందు చేస్తున్నాయి. ఆయా రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు తమ అభిమాన నాయకుడి ఫోటో ముద్రించిన క్రాకర్స్‌ను కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారుల పంట పండిందనే చెప్పాలి.రాజకీయ నేతలు, సెలబ్రీటీల పేర్లు పెట్టి క్రాకర్స్‌ను అమ్ముకోవడం ఇప్పటికిప్పుడు వచ్చిన ట్రేండేమీ కాదు. ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రధాని మోడీ ఫోటో ముద్రించిన క్రాకర్స్ హల్‌చల్ చేస్తున్నాయి. ప్యాకేట్లపై 'మేడ్ ఇన్ ఇండియా' అన్న ట్యాగ్‌ని కూడా ముంద్రించి బీజేపీ కార్యకర్తలను ఆకర్షిస్తున్నారు.ఇదే తరహాలో ఏపీలో కూడా క్రాకర్స్ అట్టలపై సీఎం వైయస్ జగన్, వైయస్ఆర్, ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్ ఫోటోలను ముద్రించి అమ్మేస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఫోటో పెట్టిన క్రాకర్స్ పెట్టెలపై జనసేన రాజకీయపార్టీ పేరు కూడా ముద్రంచారు.

# అక్కడ అలా... ఇక్కడ ఇలా

విజయవాడ, నవంబర్ 13,ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికలు జరుగుతుంటే, సందడంతా ఆ ప్రాంతంలోనే ఉంటుంది. రాజకీయ పార్టీలు, వాటి అభిమానులు, మిత్రపక్షాలు ఓ ప్రచ్ఛన్న యుద్ధం చేస్తుంటాయి.. ఒకప్పుడైతే మీడియా ప్రభావం ఓటర్లపై అంతో ఇంతో ఉండేది. ఇప్పుడు సోషల్ మీడియా జనం అభిప్రాయాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తోంది. ట్విటర్, యుూట్యూబ్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాముల్లో కూడా ఎన్నికల సంగ్రామం జరుగుతోంది.తెలంగాణలో కూడా యుద్ధ వాతావరణమే కనిపిస్తోంది. ట్విస్ట్ ఏంటంటే, తెలంగాణ ఓటర్లను ఇన్‌ఫ్లుయెన్స్ చేయడానికి ఆంధ్ర పార్టీలు ప్రయత్నించడం. తెలంగాణ బరిలో నిలిచిన మూడు ప్రధాన పార్టీలకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మూడు పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నాయి. బీజేపీకు జనసేన బాహాటంగా మద్దతు పలుకుతోంది. పొత్తులో భాగంగా ఓ తొమ్మిది అసెంబ్లీ సీట్లను కమలం పార్టీ జనసేనకు కేటాయించింది. కాబట్టి వాళ్ల మధ్య అగ్రిమెంట్ అధికారికమే.తెలంగాణలో కాంగ్రెస్ గెలవాలని తెలుగుదేశం బలంగా కోరుకుంటోంది. దీనివల్ల ఏపీలో.. కేసుల ప్రవాహంలో కొట్టుకుపోతున్న తమకు కాస్తయినా ఊతం దొరుకుతుందని, ఆ పార్టీ అధినేత భావిస్తున్నారు. 'ఏమో గుర్రం ఎగరవచ్చు' అన్నట్లు రేపు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఢల్లీ?లో మళ్లీ చక్రం తిప్పవచ్చని ఆ పార్టీ వర్గాలు గంపెడాఆశలు పెట్టుకున్నాయి. అక్కడ తెలుగుదేశం పోటీ చేయకపోవడానికి ఇది కూడా ఓ కారణమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్ర సెటిలర్ల ఓట్లన్నీ కాంగ్రెస్‌కి బదిలీ చేయడానికి అక్కడ, ఇక్కడి చంద్రబాబు అభిమానులు ప్రయత్నిస్తున్నారు.ఇక 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు దిమ్మతిరిగే 'రిటర్న్ గిఫ్ట్' ఇచ్చిన బీఆర్ఎస్ రుణం తీర్చుకోడానికి వైసీపీ కూడా తీవ్రంగా ప్రయత్నిస్తోంది.


# 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం..

**గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి.**



ధర్మవరం నవంబర్ 13 (శ్రీ సత్య సాయి జిల్లా) పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు ఏడు రోజులు పాటు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని, జూనియర్ విభాగంలో 6, 7వ తరగతులు, సీనియర్ విభాగంలో 8, 9, 10 తరగతి తరగతులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు యందు పాల్గొని విద్యార్థులు ఈనెల 13వ తేదీ సాయంత్రం లోగా సమాచారాన్ని మాకు పంపాలని తెలిపారు. ప్రతి అంశము ప్రతి తరగతి నందు ఇద్దరిని మాత్రమే ఎంపిక చేసి ప్రతి స్కూల్ నుండి పది మందిని మాత్రమే పంపాలని ఆయా పాఠశాలల హెచ్ఎం లకు వారు సూచించారు. ఈనెల 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులు, 17న కవి సమ్మేళనం, 18న చిత్రలేఖనం క్విజ్, 19న దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20న డిజిటల్ గ్రంథాలయం పై విద్యార్థులకు అవగాహన. ఈ కార్యక్రమాలన్నీ ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. కావున విద్యార్థులు, పాఠకులు, యువతి, యువకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# భక్తి బాటలో కాటసాని





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13 ---నందాల జిల్లా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి భక్తి బాటలో తపిస్తున్నారు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 26-27-తేదిల యందు 24 గంటల్లో 3 నియోజ కవర్గాలలో 3 ప్రదాన వేడుకలు నిర్వహిస్తున్నారు . ప్రత్యక్షంగా లక్ష మందిని మూడు వేదికలపై కలిపి తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు . 26 - సాయంత్రం . బనగానపల్లె అసెంబ్లీలోని యాగంటి క్షేత్రంలో అరుణాచలం తరహాలో భారీ జ్యోతిని వెలగిస్తున్నారు . 27 తేది. మద్యాహ్నం పాణ్యం మండలం కొత్తూరులో సంతానంలేని 3 వేల మంది మహిళలకు వడిబియ్యం వేడుకలు నిర్వహిస్తున్నారు. 27 తేది సాయంత్రం కర్నూలు లోని ఎస్ ఎ పి గ్రౌండ్ లో టిటిడి సహకారంతో వేలాది మంది మహిళలతో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తూ ఆరుదైన రికార్డు స్పష్టించ బోతున్నారు

# నేడు వార్డుకు పోదాం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13- నంద్యాల పట్టణం లో మంగళవారం 3 గంటలకు పొన్నాపురం 2 సచివాలయం మరియు హరిజన వాడ 1- సచివాలయంలో వార్డు కు పోదాం కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా ఓ ప్రకటన లో తెలిపారు. అలాగే పట్టణంలో 40-వార్డు బైరమల్ వీధి యందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 4 గంటలకు వార్డు పర్యటన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొనాలని సూచించారు.

# అయ్యప్ప స్వామి దీక్ష పరులకు అన్నదానం.



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13 :- నంద్యాల గుడిపాటిగడ్డలో వెలసిన భ్రమరాంభ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయం ఆవరణలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయప్రాంగణంలో అయ్యప్ప స్వామి దీక్షా పరులకు బిక్ష ఏర్పాటు చేయసంకల్పించడ మైనదని కమిటీ సభ్యులు సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కార్తీక మాసం సందర్భంగా మంగళవారం 12 గంటలకు ప్రారంభించుటకు నిర్ణయించామని అన్నదాన కమిటీ,అండ్ స్వామి అయ్యప్ప సేవా సమాజం అయ్యప్ప దేవస్థానం, వారు తెలిపారు.

## బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా భరణి రమేష్...

విభారే న్యూస్డోన్మాప్రతినిధి:-నవంబర్13 బిజెపి నంద్యాల జిల్లాఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా భరణి రమేష్ ని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా భరణి రమేష్ మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి. పురందేశ్వరి కి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ కి మరియు జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరికి, ఎస్సీ మోర్చా కమిటీలకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోడి అశోక్ కుమార్, ఎస్సీ మోర్చా డోన్ పట్టణ అధ్యక్షుడు నారాయణ స్వామి సీనియర్ నాయకుడు ఆర్మీ రామయ్య పాల్గొనడం జరిగినది.



# నంద్యాల రైల్వే స్టేషన్ లో వాహనదారులపై దౌర్జన్యాలు : సీపీఐ జిల్లా నాయకులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13- నంద్యాల రైల్వే స్టేషన్ ఆవరణంలో పార్కింగ్ గుత్తేదారునికి ఇచ్చిన పార్కింగ్ స్థలం కాక ప్రయాణికులు నడిచే దారిని కూడా ఆక్రమించి వచ్చి పోయే ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని సీపీఐ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రయాణ కుల పట్ల వాహనదారుల యజమానుల పట్ల కాంట్రాక్టర్ అనుచరులు కొంతమంది యువకులు రైల్వే స్టేషన్ ఆవరణంలో ఉండి మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ విషయంపై నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ కు తెలిపిన కూడా పట్టించుకోవ డం లేదన్నారు. పార్కింగ్ గుత్తేదారునిపై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు . తక్షణమే కాంట్రాక్టర్ పార్కింగ్ టెండర్ ని రద్దు చేయాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్. ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా నంద్యాల రైల్వే స్టేషన్ కు ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉన్నాయి యాత్రికులు ప్రయాణం చేస్తుంటారు అంతేకాకుండా ఈ రైల్వే స్టేషన్ నుండి విజయవాడ విశాఖపట్నం హైదరాబాద్ బెంగళూరు తిరుపతి ప్రతిరోజు రైలు నడుస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ఇతర ప్రాంతాల నుండి . ప్రయాణికులను డ్రాప్ చేయడానికి పికప్ చేసుకోవడానికి స్కూటర్లు కార్లు ఆటోల ద్వారా రైల్వే స్టేషన్ కు అర్ధరాత్రి పూట వస్తుంటారని వారి పట్ల ఇక్కడ పార్కింగ్ గుత్తేదారుడు అతని అనుచరులు ప్రయాణికులు వాహనదారుల పట్లమహిళలపట్లదౌర్జన్యంచేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. వారికి ఇచ్చిన పార్కింగ్ స్థలం కాక ప్రయాణికులు నడిచే స్థలం కూడా అక్రమించి వసూళ్లకు పాల్పడుతున్నారు వీరి ఆగడాలను వెంటనే అదుపు చేయాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి రైల్వే స్టేషన్ మేనేజర్ పై డిఆర్ఎం రైల్వే జీఎం కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# సిపిఎం ప్రజారక్షణ బేరిని జయప్రదం చేయండి...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:- నవంబర్ 13 కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ "సీపీఎం ప్రజా రక్షణ బేరి" బస్సు యాత్రల ముగింపు సందర్భంగా సిపిఎం విడుదల చేసిన ప్రజాప్రణాళిక అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 15 తేదీన జరిగే చలో విజయవాడ భారీ బహిరంగ సభ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ పిలుపునిచ్చారు సోమవారం విజయవాడలో జరుగుతున్న సీపీఎం ప్రజారక్షణ భేరి బహిరంగ సభ జయప్రదం చేయాలని మినీ జాత ను సిపిఎం సీనియర్ నాయకులు కొండయ్య గారు జండా ఊపి ప్రారంభించారు అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ సిఐటియు పట్టణ కార్యదర్శి శివరాం,మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు మన అందరిని కలవర పరుస్తున్నాయి,ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరిస్తారని ఎదురు చూసే కన్నా మన బతుకులను రాష్ట్ర భవిష్యత్తును సరైన మార్గాన నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించవలసిన సమయం వచ్చింది,ఈ ఉద్యమంలో సిపిఎం పార్టీ మీతో పాటు ఉంటుంది,రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు పూర్తి కావస్తుంది, కేంద్రంలో బిజెపి నాయకులు ప్రత్యేక హోదా,పోలవరం జాతీయ ప్రాజెక్టు,కడప ఉక్కు ఫ్యాక్టరీ ,రాయపట్నం మేజర్ పోర్టు,రాజధాని నిర్మాణం, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ,కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటు, రైల్వే జోన్ లాంటివి విభజన సమయంలో హామీలు ఇచ్చారు,ఏ ఒక్కటి అమలు కాలేదు,రాష్ట్రాన్ని నిలువున ముంచింది బిజెపి పార్టీ అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగ నమ్మడానికి తయారైంది ,బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారయింది,బిజెపి అధికారం ఉన్న రాష్ట్రాలలో మైనార్టీలకు భద్రత లేకుండా పోయింది,కోట్లాదిమంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను తెచ్చింది,దేశ వ్యవసాయానికి ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది,అదేవిధంగా పోర్టులని ఆదానికి అప్పజెప్పడం చాలా సిగ్గుచేటు,ఇంతలా దేశాన్ని నాశనం చేసే బిజెపి పార్టీని రాష్ట్ర అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అదేవిధంగా జనసేన,టిడిపి పార్టీ లాంటివి బిజెపిని సపోర్టు చేయడం చాలా సిగ్గుచేటు అని వారు అన్నారు,రాష్ట్రానికి ఇంతలా ద్రోహం చేసి విభజన హామీలను కూడా అమలు చేయకుండా రాష్ట్రాన్ని నాశనం చేయాలని చూస్తున్నా బిజెపి పార్టీని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్లెత్తు మాట కూడా అనకపోవడం చాలా బాధాకరమని వారన్నారు. రాజధాని నిర్మాణం ఇంతవరకు పూర్తి



కాలేదు,వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల జపం చేస్తున్నాడు,కానీ అధికారం యావత్తు సీఎం వద్దనే తిరుగుతున్నాయి,కేంద్రం చెప్పినట్లు తలాడిస్తూ రాష్ట్ర ప్రజల పైన మోయలేని భారాలను వడ్డిస్తున్నారు, విద్యుత్ చార్జీలు మోయలేని భారంగా చార్జీలు పెంచుతున్నారు,స్మార్ట్ మీటర్ల పేరా మోటార్లకు మీటర్ల పేరుతో ఆస్తి పన్ను నుంచి చెత్త పన్ను దాకా అన్ని వడ్డింపులతో ప్రజలపై భారాలు మోపుతున్నారు,వైసీపీ ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులు నామమాత్రంగా తయారవడంతో కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి సామాన్యులు బలైపోతున్నారు,లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పెన్షన్ విషయంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కి జిపిఎస్ పేరుతో మోసం చేసింది.ఈ జగన్ ప్రభుత్వం అంగన్వాడీలకు,ఆశలకు కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు చేసిన వాగ్దానాలన్నీ గాలికి ఎగిరిపోయాయి,ప్రజలతో కష్టాల గురించి చెప్పుకోవాలంటే వినడానికి మన సీఎం జగన్మోహన్ రెడ్డికి ఒక్కరోజు కూడా తీరికలేదు, ఎంతసేపు నవరత్నాల గురించి తప్ప పెరిగే ధరలు,నిరుద్యోగము గిట్టుబాటు లేని వ్యవసాయం వ్యవసాయం రక్షణ కరువైంది చేతివృత్తులు,కౌలు రైతులు ఈ ప్రభుత్వానికి కనబడడం లేదు, ఈ విధంగా ప్రజల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను రాష్ట్రాన్ని పూర్తిగా గాలికి వదిలేసాయి,అందుకే సిపిఎం పార్టీ ఈనెల 15 తేదీన చలో విజయవాడ ప్రజారక్షణ బేరి మోగిస్తుంది,ఈ యొక్క ప్రజారక్షణ బేరి సభకు ప్రజలందరూ హాజరుకావాలని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షేమిమ్ బేగం, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, రైతు సంఘం మండల కార్యదర్శి నాగమద్దయ్య, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు మహబూబ్ బాషా,అశోక్ ,సిపిఎం నాయకులు సుధాకర్, నాగన్న,నాగభూషణం, సురేంద్ర,రామాంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

# టోల్ ప్లాజా ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.... సిఐటియు

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:- నవంబర్ 13 క్రిష్ణగిరి మండల పరిధి జాతీయ రహదారి ఎన్.హెచ్ -44 లోని అమకతాడుటోల్ ప్లాజాలో పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,డోన్ పట్టణ,మండల అధ్యక్షులు నక్కి శ్రీకాంత్,వి.రామాంజనేయులు,ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు కోయిలకొండ నాగరాజు,అమకతాడు టోల్ ప్లాజా వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అయ్యారాజు,రాజశేఖర్,కోశాధికారి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.సోమవారం టోల్ ప్లాజా మేనేజర్ వికాస్ విక్రమ్ సింగ్ తో చర్చలు జరిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో సహకార్ గ్లోబల్ లిమిటెడ్ అనే కొత్త సంస్థ వచ్చిందని వారితో చర్చించి వేతనాలు పెంచుకున్నామన్నారు.అయితే ఒక నెల వేతనం దీపావళికి బోనస్ గా ఇవ్వవలసి ఉండగా దానిని ఇవ్వలేదన్నారు.ప్రధాన కార్యాలయం నుండి అనుమతులు వచ్చిన వెంటనే బోనస్ ఇస్తాము అని చెబుతూ వచ్చిన మేనేజర్ తీరా పై నుండి అనుమతులు రాలేదన్న కారణంగా ఇప్పటికిప్పుడు బోనస్ ఇవ్వలేమని చెప్పడం సరి కాదన్నారు.బోనస్ తో పాటు నలుగురు ఆపరేటర్లకు వేతనాలలో కొంత వ్యత్యాసం ఉన్నదని వారి సర్వీస్ సీనియార్టీ ప్రకారం అందరితో సమానంగా వారికి వేతనాలు వచ్చే విధంగా చూడాలని, అదేవిధంగా ఏడుగురు



ఆపరేటర్లకు సీనియార్టీ ప్రకారం సూపర్వైజర్లుగా ప్రమోషన్స్ ఇవ్వవలసి ఉండగా ఇద్దరికి మాత్రమే ప్రమోషన్స్ ఇచ్చారని మిగతా 5 మందికి కూడా వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు.చర్చల సందర్భంగా సానుకూలంగా స్పందించిన మేనేజరు యాజమాన్యంతో మరొకసారి చర్చించి అతి త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు.వారి హామీ మేరకు కొంత సమయం వేచి చూడాలని నిర్ణయించామని అప్పటికీ సమస్యలు పరిష్కారం కాని యెడల ఉద్యమాలకు సిద్ధం అవుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేష్,ఆర్.కె.వి.రాజు,రాముడు,నాగేంద్ర,చాణక్యనాయుడు,మహేష్ నాయుడు,సోమశేఖర్ గౌడ్,వళి,మున్నీ బేగం,సిఐటియు నాయకులు అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నోట్ల మార్పిడి కేసులో మరో ఇద్దరు అరెస్ట్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13 :-. నోట్ల మార్పిడి కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో నిందితుల వద్ద నుంచి రూ30 లక్షల నగదు ,ఒక కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జులై నెల 20వ తేదీన రైతు నగర్ కు చెందిన శ్రీనివాస్ రెడ్డి, అతని స్నేహితుల వద్ద నుంచి 2000 రూపాయల నోట్లు మార్పిడి చేయడానికి వచ్చి 500 రూపాయల నోట్లు 2.20 కోట్లను కొంతమంది వ్యక్తులు చాకచక్యంగా తీసుకెళ్లారు. శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ కేసులో శ్రీకాకుళం చెందిన అమిత్ రెడ్డి, విశాఖపట్నం చెందిన లోకనాధులను పోలీసులు అరెస్టు చేసి రు 30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఇదే కేసులో టంకాల శోభన్ బాబు, కంచరన చినబాబు లను అరెస్టు చేసి 70 లక్షలు రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన తాలూకా సీఐ దస్తగిరి బాబు, రూరల్ సీఐ రవీంద్ర, తాలూకా ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి గారు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రపంచ చక్కెర వ్యాధి వారోత్సవాలు... కంటి వైద్య నిపుణులు- డాక్టర్. ఎస్.నరసింహులు



ధర్మవరం నవంబర్ 13 ఆంధ్ర రేఖ ప్రతినిధి ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించబడే" ప్రపంచ చక్కర వ్యాధి వారోత్సవాలు"లను జయప్రదం చేయాలని కంటి వైద్య నిపుణులు, రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి- డాక్టర్ ఎస్. నరసింహులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వారోత్సవాల్ని పురస్కరించుకొని ఎస్బిఐ కాలనీ లోని మధు కంటి వైద్యశాలలో వారం రోజులు పాటు కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. కంటి భాగంలో రెటీనా పరీక్షలు అతి ముఖ్యమైనవని, నిర్లక్ష్యం చేస్తే గుడ్డితనానికి దారి తీసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలో చక్కెర వ్యాధి అనేది చాలా తీవ్రంగా ఉందని, రెటీనా పరీక్షలు తప్పనిసరిగా వైద్య చికిత్సలతో చేయించుకోవాలని, కంటి సమస్య ఉన్నవారు, అందుబాటులోని కంటి డాక్టర్ను సంప్రదిస్తూ వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. చక్కెర వ్యాధిని ప్రతి ఒక్కరూ అదుపులో పెట్టుకోవడం ఎంతో ముఖ్యమని, నిర్లక్ష్యం చేస్తే శరీరంలోని అన్ని అవయవాలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. కంటి రక్షణ ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని వారు తెలిపారు. కావున పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఈ వారం రోజులలో జరిగే ఉచిత రెటీనా పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రజాకవి,అంబెడ్కరిస్టు కు సన్మానం



అనంతపురం నవంబర్ 13 ఆంధ్రరేఖ ప్రతినిధిఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్వర్యంలో ప్రజాకవి, బహుజన సామాజిక వేత్త, అంబెడ్కరిస్టు, దాసరి ఆదినారాయణ ని సన్మానించారు సంధర్భంగా జిల్లా అధ్యక్షుడు కటిక జయరాం,మాట్లాడుతూ దళిత, బహుజన వర్గాలకోసం తన జీవితం ధారపోసిన ఆదినారాయణ ని సన్మనిచుకోడం మన అందరి బాధ్యత అన్నారు, పేద వర్గాలకోసం తన గొంతుకతో మార్పు తీసుకొచ్చిన ఘనత ఆదినారాయణ కి దక్కుతుంది అన్నారు. ఈలాంటి వ్యక్తులు ప్రజాక్షేత్రంలో ఉండాలన్నారు.తెలంగాణా లో అనేకమంది ప్రాజా గాయకులకు గుర్తింపునిచ్చి చట్టసభలకు పంపించారని ఆంధ్రప్రదేశ్ లో అనేకమంది కళాకారులు ఉన్నారని ఎటువంటి వారిని గుర్తించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాకార్యదర్శి సి. పాల్, ఆర్థిక కార్యదర్శి యం.లక్ష్మీనారాయణ, ఈ.సి.మెంబర్ శాంతిముని, రామన్న ,నరసింహులు, అంజి,రంగనాయకులు, కుల్లయప్ప,వేణు గోపాల్, ఇతరనాయకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190